# జ్ఞానము, విశ్వాసము మరియు బాప్తిస్మమందలి తీర్మానము

> ''అయితే వారు సున్నతిపొందినవారైనను ధర్మశాస్త్రము ఆచరింపరు; తాము మీ శరీరవిషయమందు అతిశయించు నిమిత్తము మీరు సున్నతి పొందవలెనని కోరుచున్నారు. అయితే మన ప్రభువైన యేసుక్రీస్తు సిలువయందు తప్ప మరి దేనియందును అతిశయించుట నాకు దూరమవును గాక; దానివలన నాకు లోకమును లోకమునకు నేనును సిలువవేయబడి యున్నాము. క్రొత్త సృష్టి పొందుటయే గాని సున్నతి పొందుటయందేమియు లేదు, పొందకపోవుటయందేమియు లేదు'' (గలతీ. 6:13–15 ).

భౌతికమైన కార్యములు దేవునికి ముఖ్యమే. ధర్మశాస్త్రం క్రింద, సున్నతి పొందని మగవాడు తన ప్రజలలోనుండి కొట్టివేయబడుననే వాస్తవంలో యిది కన్పిస్తుంది (ఆది. 17:14). ఏదియెలాగున్నా, సరియైన జీవిత విధానములో చేర్చబడని సున్నతి సున్నతి లేనట్టే ఎంచబడింది (రోమా 2:25). అలాగే, దానితో కలసియున్న ఆత్మ సంబంధమైన సూత్రాలకు హృదయ పూర్వకంగా లోబడినట్లయితేనే బాప్తిస్మానికి విలువ ఉంటుంది. అందులో మన పక్షంగా భౌతికమైన భాగం మాత్రమే గాక, దానితో హృదయపు ఏకీభావం కూడా కలిసియుంటుంది.

ఆయనతో మనకుండే బాంధవ్యంలో దేవుడు ఎన్నడును వట్టి భౌతికమైన కార్యాలను కోరలేదు. ఆయన హృదయం మీదను, కార్యం మీదను దృష్టి నిలుపుతాడు. ఏలీయాబు ఎత్తును, అతని ఆకారాన్ని చూచి సమూయేలు తప్పుగా తీర్మానం చేశాడు – ఏలీయాబును దేవుడు ఇశ్రాయేలీయులకు రాజుగా కోరుకుంటాడని అతడు తలంచాడు. అప్పుడు దేవుడు అతనితో యిలా తెలియజేశాడు: ''–అతని రూపమును అతని యెత్తును లక్ష్యపెట్టకుము, మనుష్యులు లక్ష్యపెట్టువాటిని యెహోవా లక్ష్యపెట్టడు; నేను అతని త్రోసివేసియున్నాను. మనుష్యులు పైరూపమును లక్ష్యపెట్టుదురు గాని యెహోవా హృదయమును లక్ష్యపెట్టును'' (1 సమూ. 16:7).

క్రీస్తుతో సిలువవేయబడిన ఒక క్రొత్త జీవితాన్ని – దేవుడు కోరుతున్నాడు (గలతీ. 6:14, 15). మనం బాప్తిస్మం పొందినప్పుడు నూతన జీవంలో ప్రవేశింపనట్టయితే, మన బాప్తిస్మానికి విలువ ఉండదు. బాప్తిస్మము ద్వారా అనుభవించే మరణము, సమాధి, పునరుత్థానాల వెంట నూతన జీవం రావాలి (రోమా 6:4).

ఈ మార్పుకు పౌలు యొక్క జీవితం పరిపూర్ణమైన మాదిరియై ఉంది. బాప్తిస్మమందు తన ప్రాచీన పురుషుని చంపి, ప్రభువు కొరకు అప్పుడు నూతన జీవితాన్ని ఆరంభించాడు. రోమా 6:4–6 మనకు యిలా చెప్పుతోంది:

> కాబట్టి తండ్రి మహిమవలన క్రీస్తు మృతులలోనుండి యేలాగు లేపబడెనో, ఆలాగే

మనమును నూతనజీవము పొందినవారమై నడుచుకొనునట్లు, మనము బాప్తిస్మమువలన మరణములో పాలుపొందుటకై ఆయనతోకూడ పాతిపెట్టబడితిమి. మరియు ఆయన మరణముయొక్క సాదృశ్యమందు ఆయనతో ఐక్యముగలవారమైన యెడల ఆయన పునరుత్థానము యొక్క సాదృశ్యమందును ఆయనతో ఐక్యముగలవారమై యుందుము. ఏమనగా మనమికను పాపమునకు దాసులము కాకుండుటకు పాపశరీరము నిరర్థక మగునట్లు, మన ప్రాచీన స్వభావము ఆయనతో కూడ సిలువవేయబడెనని యెరుగుదుము.

పౌలు దీనిని ఈ విధంగా చెప్పాడు: ''నేను క్రీస్తుతో కూడ సిలువ వేయబడియున్నాను; ఇకను జీవించువాడను నేను కాను, క్రీస్తే నాయందు జీవించుచున్నాడు. నేనిప్పుడు శరీరమందు జీవించుచున్న **జీవితము** నన్ను ప్రేమించి, నా కొరకు తన్ను తాను అర్పించుకొనిన దేవుని కుమారునియందలి విశ్వాసమువలన జీవించుచున్నాను'' (గలతీ. 2:20; నొక్కి పలికింది నాది).

## మనం తప్పక ఎరుగవలసిందేం?

బాప్తిస్మం పొందాలని తాము ఎరిగిన దినముననే అపొస్తులుల కార్య గ్రంథంలో క్రైస్తవులైనవారు బాప్తిస్మం పొందియున్నందున, మనం తెలిసికోవలసిందంతా కూడా దేవుడు బాప్తిస్మం పొంద నాజ్ఞాపించాడనే విషయమేనని కొందరు తీర్మానించారు. ఏదియెలాగున్నా, దీనికంటే ఎక్కువే బోధింపబడింది. అంటే, బాప్తిస్మం పొందిన వారి వద్దనుండి దీనికంటె ఎక్కువయే కోరబడిందని దాని భావం. క్రీస్తు యొక్క శిష్యులు లేక అనుచరులుగా మారిన స్త్రీ పురుషులు ఒప్పింపబడేలా ఈ క్రింద పేర్కొనబడిన కొన్ని సత్యాలు వారికి బోధింపబడింది:

1. **ఒకే అద్వితీయ సత్య దేవుడున్నాడు** (అపొ. 3:13; 14:15; 17:23-31). ప్రజలను రక్షణకు నడిపించడానికి గాను, యూదులకు అబ్రాహాము, ఇస్సాకు, యాకోబు అనేవారి దేవుడు ప్రకటింపబడ్డాడు. తరువాత, అన్యజనులకు, పౌలు, ఆకాశమును భూమిని అందలి సమస్తాన్ని నిర్మించిన దేవుని ప్రకటించాడు.

2. **యేసు ప్రభువును, క్రీస్తును, దేవుని కుమారుడునైయున్నాడు.** (అపొ. 2:36; 4:10, 11; 5:42; 9:20, 22; 10:36; 17:3; 18:5, 28లను చూడు.) యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అనేదానిమీద ఆధారపడి ఆత్మ సంబంధమైన జీవం ఉంది (యోహాను 20:30, 31).

3. **దేవుని మాటలవలన రక్షణ పొందుతారు** (అపొ. 11:14; 16:32; 2 తిమోతి 4:2ను కూడ చూడు).

4. **యేసు రక్షకుడైయున్నాడు. ప్రభువైన యేసు మరణం, సమాధి, పునరుత్థానాలతో కూడిన సంపూర్ణ సువార్త ప్రకటింపబడింది.** (అపొ. 2:32; 8:5, 25, 35; 14:7, 21; 16:10; 1 కొరింథీ. 2:1, 2; 15:1-4లను కూడ చూడు.)

5. **ప్రభువైన యేసు లేకుండ మనము నశించిపోయినవారమే మరియు క్షమాపణ యొక్క అవసరంలో నిలిచిపోయి ఉంటాం** (అపొ. 4:10-12).

6. **మనం మారుమనస్సు పొందవలసియుంది, అంటే, మన జీవితాలను మార్చుకోవలసి వస్తుంది** (అపొ. 2:38; 3:19; 17:30).

7. **మనం బాప్తిస్మం పొందినప్పుడు పాపాలు క్షమింపబడ్డాయి** (అపొ. 2:38; 22:16).

8. **దేవుని రాజ్యమును గూర్చిన సత్యం ప్రకటింపబడింది** (అపొ. 8:12; 19:8; 20:25; 28:23, 31).

తాను బాప్తిస్మము పొందక ముందు ఐతియోపీయ అధికారియైన నపుంసకునికి ఏమి తెలిసియుంటుంది? (అపొ. 8:26–39 చూడు.) యెషయా 53లోని లేఖన భాగంనుండి ఫిలిప్పు అతనికి క్రీస్తును ప్రకటించాడు. ఈ ప్రవచనమునుండి అతడు ప్రభువైన యేసును గూర్చి ఉపదేశించి ఉండవచ్చు: ''మన దోషములనుబట్టి (క్రీస్తు) నలుగగొట్టబడెను'' (5 వ.); ''యెహోవా మన యందరి దోషమును అతని మీదమోపెను'' (6 వ.); ''అతడు తన్ను తానే అపరాధ పరిహారార్థ బలి'' చేశాడు (10 వ.); ''నీతిమంతుడైన నా సేవకుడు జనుల దోషములను భరించి… అనేకులను నిర్దోషులుగా చేయును'' (11 వ.); ''అతడు తానే అనేకుల పాపమును భరించును'' (12 వ.).

''దేవుని రాజ్యమును గూర్చియు యేసుక్రీస్తు నామమును గూర్చియు'' ఫిలిప్పు సమరయులకు ప్రకటించిన సువార్తను (అపొ. 8:12) అతనికి కూడ ప్రకటించియుండవచ్చు. సంక్షిప్తంగా చెప్పాలంటే ఫిలిప్పు ''అతనికి యేసును గూర్చిన సువార్త ప్రకటించెను'' (అపొ. 8:35).

దానికి ప్రతిఫలంగా ఐతియోపీయ అధికారియైన (నపుంసకుడు) బాప్తిస్మం పొందగోరాడు. తన పాపముల కొరకు చనిపోయిన యేసే క్రీస్తయి ఉన్నాడని అతడు గ్రహించినట్టు మనం తీర్మానించవచ్చు. క్రీస్తు రాజ్యంలోనికి ప్రవేశించడానికి తాను తిరిగి జన్మించాలన్న విషయం అతడెరుగు (యోహాను 3:5). క్రీస్తును అనుసరించడానికి అతడు తీర్మానం చేసికొని, క్రీస్తుయొక్క మరణం ద్వారా బాప్తిస్మంవలన తన పాపాలు క్షమింపబడ గోరినట్టున్నాడు. క్రైస్తవుడు కాగోరిన వాడెవడైనా ఈ సంగతులు తప్పక ఎరగవలసియుంటుంది.

## మనం నమ్మవలసిందేమి

రక్షింపబడడానికి గాను మనం బాప్తిస్మం పొందాలి (మార్కు 16:16; 1 పేతురు 3:21). రక్షింపబడడానికి గాను మనం ఏమి నమ్మవలసియుందో, బాప్తిస్మం పొందడానికి కూడా మనం అదే నమ్మవలసియుంటుంది. మనం నమ్మవలసిన ఈ క్రిందివాటిని గమనించు:

- మనం పాపులం (1 తిమోతి 1:15).
- దేవుడు ఉన్నాడు, తన్ను శ్రద్ధతో వెదకువారికి ఫలము దయచేయువాడు (హెబ్రీ. 11:6).
- యేసు ''నేనే'' అయ్యున్నాడు.[1]
- యేసు, క్రీస్తు (యోహాను 20:30, 31), మరియు ప్రభువు (అపొ. 2:36). అయ్యున్నాడు అంటే, ఆయన చెప్పిన దానిని మనం చేయ బద్ధులమైయున్నాం (మత్తయి 7:21; లూకా 6:46).
- యేసు యొక్క మాటలు (యోహాను 5:47; 12:49, 50) మరియు సువార్త (మార్కు 16:15, 16; రోమా 1:16; ఎఫెసీ. 1:13)అనేవాటిని నమ్మాలి.
- యేసును గూర్చిన సాక్ష్యాన్ని (యోహాను 17:20; 2 థెస్స. 1:10), రాజ్యమును గూర్చిన ఉపదేశాన్ని (అపొ. 8:12) నమ్మవలసియుంటుంది.
- యేసు (మృతులలోనుండి) లేపబడ్డాడు (రోమా 10:9).
- తన రక్తం ద్వారా క్రీస్తు మన పాపములకు శాంతికరమైయున్నాడు (రోమా 3:24, 25).

• దేవుడు మన జీవితాల్లో పని చేస్తాడు (కొలస్సీ. 2:12).

మనం దేన్ని నమ్మాలో దేవుడే కోరుకుంటున్నాడు – అయితే మనం ఏమి నమ్మాలి, ఏమి చేయాలి అనేదాన్ని ఆయన ఎందుకు కోరుకున్నాడో దానిని మనం గ్రహించడం ఆయనకు అవసరం లేదు. ప్రభువైన యేసునందు, ఆయన రక్తమందు మనం నమ్మిక ఉంచాలని ఎందుకు కోరుకున్నాడో లేక క్షమింపబడడానికి గాను మారుమనస్సు పొంది, ఒప్పుకొని బాప్తిస్మం ఎందుకు పొందమన్నాడో మనం ఎన్నడూ తెలిసికొనలేకపోవచ్చు. ఈలాటివి కావాలని ఆయన ఎందుకు కోరుకున్నాడు అని మనం అడుగకూడదు. అయితే దేవుడు చేయు దానియందు విశ్వాసంతో మనం నడుచుకోవాలి.

## మనం తీర్మానించుకోవలసింది ఏమని

### క్రొత్త సృష్టి అవడానికి

మన చుట్టునున్న దుష్ట లోకంనుండి వేరై నూతనమైన జనముగా ఉండాలి. ప్రభువు యొక్క సేవలో మన శరీరాలను సజీవయాగంగా సమర్పించాలి. పౌలు యిలా అన్నాడు: ''క్రొత్తసృష్టి పొందుటయేగాని సున్నతి పొందుటయందేమియు లేదు, పొందక పోవుటయందేమియు లేదు'' (గలతీ. 6:15). అతడు యిలా అని కూడ వ్రాశాడు,

> కాబట్టి సహోదరులారా, పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవ యాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడని దేవుని వాత్సల్యమును బట్టి మిమ్మును బతిమాలుకొనుచున్నాను. ఇట్టి సేవ మీకు యుక్తమైనది. మీరు ఈ లోక మర్యాదను అనుసరింపక, ఉత్తమమును, అనుకూలమును, సంపూర్ణమునై యున్న దేవుని చిత్తమేదో పరీక్షించి తెలిసికొనునట్లు మీ మనస్సు మారి నూతన మగుటవలన రూపాంతరము పొందుడి (రోమా 12:1, 2).
>
> కాగా ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి; పాతవి గతించెను, ఇదిగో క్రొత్తవాయెను (2 కొరింథీ. 5:17).

ఈ నూతన సృష్టి మరియు స్వయం – బలి అనేవి హృదయ పూర్వకంగా లోబడినదానికి ప్రతిఫలం బాప్తిస్మమందు జరుగుతాయి (రోమా 6:4-7, 17, 18). హృదయం ఏకీభవించకుండ కేవలం మన పక్షంగా జరిగే భౌతికమైన కార్యము సరిపోదు. చర్చ్ బిల్డింగ్ యొక్క ముఖ ద్వారమునుండి, ఒక త్రాగుబోతును తెచ్చి, వెనుక ద్వారం గుండా ఈడ్చుకొని పోయినంత మాత్రాన తన త్రాగే అలవాటునుండి అతడు ఎలా బాగుపడలేడో – అలాగే మనం నీటిలో ముంచబడినంత మాత్రాన మనం మార్పు పొందలేం. మనం బాప్తిస్మం పొందినప్పుడు మారిన హృదయాలు గలవారమైయుంటేనే మనం నూతన సృష్టి లేక నూతన జీవులమైయుంటాం.

బాప్తిస్మం యొక్క సందర్భంలో (రోమా 6:3-7), పౌలు దానిని ఈ విధంగా వ్యక్తపరచాడు: ''మీరు పాపమునకు దాసులై యుంటిరిగాని యే ఉపదేశ క్రమమునకు మీరు అప్పగింపబడితిరో, దానికి హృదయపూర్వకముగా లోబడినవారై, పాపమునుండి విమోచింపబడి నీతికి దాసులైతిరి;

ఇందుకు దేవునికి స్తోత్రము'' (రోమా 6:17, 18).

ప్రాచీన పురుషుని విసర్జించి నవీన పురుషుని ధరించుకోవాలని దేవుడు మనలను కోరుతున్నాడు. కొలస్సీ. 3:10 యిలా అంటుంది: ''ఏలయనగా ప్రాచీన స్వభావమును దాని క్రియలతో కూడ మీరు పరిత్యజించి, జ్ఞానము కలుగు నిమిత్తము దానిని సృజించినవాని పోలికచొప్పున నూతనపరచబడుచున్న నవీన స్వభావమును ధరించుకొనియున్నారు.''

మనము క్రీస్తుయేసును గూర్చి నేర్చుకున్నప్పుడు, పాపపు అలవాట్లు గత జీవితానికి సంబంధించినవిగా గుర్తించవలసినవారమై ఉంటాం. ఎఫెసీ. 4:20–24 యిలా అంటుంది,

> అయితే మీరు యేసునుగూర్చి విని, ఆయనయందలి సత్యము ఉన్నది ఉన్నట్టుగానే ఆయనయందు ఉపదేశింపబడినవారైన యెడల, మీరాలాగు క్రీస్తును నేర్చుకొన్నవారు కారు. కావున మునుపటి ప్రవర్తన విషయములోనైతే, మోసకరమైన దురాశలవలన చెడిపోవు మీ ప్రాచీన స్వభావమును వదలుకొని మీ చిత్త వృత్తియందు నూతనపరచబడినవారై, నీతియు యథార్థమైన భక్తియుగలవారై, దేవుని పోలికగా సృజింపబడిన నవీన స్వభావమును ధరించుకొనవలెను.

శిశు బాప్తిస్మంలో ఉండే ఒక సమస్య ఏమంటే, శిశువు గ్రహించలేడు సరిగదా, బాప్తిస్మంలో ఏ మార్పు జరగాలో ఆ మార్పును జరిగించుకోలేడు. అతడు హృదయపూర్వకంగా లోబడలేడు, ఎందుకంటే తాను బాప్తిస్మం పొందినప్పుడు హృదయం రూపాంతరం పొందాలన్న సంగతిని అతడు అర్థం చేసికోలేడు.

క్రీస్తునందున్న రక్షణను మనం వాంఛించినప్పుడు, ఆయన క్షమాపణను వెదకుతూ, యథార్థమైన హృదయంతో మనం ఆయన వద్దకు రావలసియుంటుంది. బాప్తిస్మమందు ఆయనతో కూడ పాతిపెట్టబడినప్పుడు, ఆయన కొరకు నూతన సృష్టిగా రూపొందడానికి మనం తీర్మానించు కొనియుండాలి. దీనికంటే ఏ తక్కువ ఉద్దేశంతోనైనా మనం బాప్తిస్మానికి సమీపించామంటే, బాప్తిస్మం యొక్క అర్థాన్ని మనం పోగొట్టుకుంటాం.

**శిష్యుడు అవడానికి**

యోహానుచే బాప్తిస్మం పొందినవారు అతని శిష్యులు ఎలాగయ్యారో, యేసు యొక్క బాప్తిస్మం పొందినవారు ఆయన శిష్యులయ్యారు (యోహాను 4:1). అతని బోధను అనుసరించి నడుచుకొనునట్లు ఒకని వద్ద నేర్చుకొనేవానిని సూచించడానికి ''శిష్యుడు'' (Gk.: *mathetes*) అనే పదం ఉపయోగించబడింది. ఒక నామంలో బాప్తిస్మం పొందడం అనేదానిలో గుప్తమ య్యిందేమంటే బాప్తిస్మం పొందేవాడు అతని ఉద్దేశాన్ని అంగీకరించి అతనిని వెంబడించువాడు శిష్యుడై ఉంటాడు.

కొరింథు సంఘములో తల ఎత్తిన విభజనలను రూపుమాపడానికి మొదటి కొరింథీ పత్రికలో పౌలు ప్రయత్నించాడు. వేర్వేరు ప్రముఖ క్రైస్తవులను అంటే, పౌలు, అపొల్లో, కేఫావంటివారిని వెంబడిస్తున్నట్టు ఆయా సభ్యులు చెప్పుకొంటున్నారు (1 కొరింథీ. 1:10–16). (కేఫా అన్నా పేతురన్నా ఒకడే; యోహాను 1:42 చూడు). పౌలు నామమున మీరు బాప్తిస్మం పొందారా అని అతడు వారిని ప్రశ్నించాడు (1 కొరింథీ. 1:13). అంటే, వారు పౌలు నామమున బాప్తిస్మము

పొందియున్నట్టయితే, అప్పుడు పౌలుయొక్క అనుచరులు అని పిలువబడవచ్చునని దాని భావం.

ప్రభువైన యేసు నామమున మనం బాప్తిస్మం పొందునప్పుడు, ఆయన శిష్యులం లేక అనుచరులమై ఉంటున్నామని గుర్తించాలి – అంటే, ఆయన మన ప్రభువుగాను మనం ఆయన సేవకులంగాను మారిపోతాం. మనం యిక ఎన్నడు పాపాన్ని సేవింపక; దానికి బదులు మనం క్రీస్తును సేవించువారమైయుండాలి. ఆయనను ప్రభువుగా గుర్తించి, మన శిరస్సుగా మన మాయనకు లోబరచుకొనియుండాలి (ఎఫెసీ. 5:24).

## సంగ్రహము

బాప్తిస్మము ఆత్మ సంబంధమైన సంబంధాలు సూచనలు కలిగియున్న భౌతికమైన కార్యం. ఇవి లేకుంటే, బాప్తిస్మము విలువలేనిదైయుంటుంది. బైబిలు యొక్క దృష్టినుండి బాప్తిస్మం పొందడానికిగాను, పాపక్షమాపణ ద్వారా దేవునితో మన బాంధవ్యం తప్పుది ఒప్పుగా చేసికొంటున్నట్టు గ్రహించాలి. పాప జీవితాన్ని వదలుకొని, యేసును ప్రభువుగాను యజమానిగాను అంగీకరించి సమర్పణతో కూడిన నూతన జీవితంలోనికి ప్రవేశించాలి.

---

సూచనలు

[1]Jesus said, "I am He." The Greek is without "He" (John 8:24; see also 8:28, 58; 13:19), so the English text should read that Jesus said, "I am."

---

## సువార్త, బాప్తిస్మం

సువార్తను విని విశ్వసింపనట్లయితే, బాప్తిస్మము విలువలేనిదై ఉంటుంది. అందువలన, ''బాప్తిస్మమిచ్చుటకు క్రీస్తు నన్ను పంపలేదు గాని, … సువార్త ప్రకటించుటకే ఆయన నన్ను పంపెను'' అని పౌలు వ్రాశాడు (1 కొరింథీ. 1:17ఎ). బాప్తిస్మం ప్రాముఖ్యం కాదని పౌలు చెప్పడం లేదు, కాని సువార్త యొక్క ప్రాముఖ్యతను అతడు నొక్కి చెప్పుతున్నాడు. ''కాదు … కాని'' అనే గ్రీకు భాషా సాంప్రదాయంలో పౌలు బాప్తిస్మమివ్వలేదని కాదు. ఎందుకంటే అతడు బాప్తిస్మమిచ్చాడు (1 కొరింథీ. 1:14–16); అయితే, సువార్తను ప్రకటించడం తనకు ముఖ్యమైయున్నట్టు దాని భావం.[1]

బాప్తిస్మము సువార్తలో భాగమైయున్నా, సంపూర్ణ సువార్త లేకుండ రక్షించనేరదని పౌలు ఉపదేశిస్తున్నాడు. ఎందుకంటే రక్షించే శక్తి సువార్తలో ఉంది (రోమా 1:16; ఎఫెసీ. 1:13), బాప్తిస్మంలో కాదు. మనలను రక్షించేది విశ్వాసము, మారుమనస్సు, ఒప్పుకోలు, బాప్తిస్మము అనేవి కావు. రక్షించేది ప్రభువైన యేసు రక్తం మాత్రమే; ఏదియెలాగున్నా, మన విశ్వాసము మారుమనస్సు పొంది, ఒప్పుకొని, బాప్తిస్మం పొందేలా నడిపించేవరకు ఆయన రక్తము మనలను

రక్షించదు. ప్రకటింపబడిన దేవుని వాక్యాన్ని విని సువార్తవలన మనము అట్టి విధేయతకు నడిపింప బడవలసినవారమైయున్నాం.

రక్షణ యొక్క ''ఏమి,'' ''ఎప్పుడు'' అనేవాటి మధ్య వ్యత్యాసముంది. తన మరణమందు చిందింపబడిన యేసు రక్తము మనలను రక్షించేది. ''నా పాపములను కడిగివేయగలదేది?'' అనే పాత పాట సరిగా అడుగుతుంది. మరల దానికి ''యేసు రక్తంగాక మరేది లేదు'' అని బదులిస్తుంది. మనం చేసేది ఏదీ రక్షింపనేరదు (ఎఫెసీ. 2:8, 9); కేవలం యేసు రక్తం మాత్రమే ఆ పని చేస్తుంది (మత్తయి 26:28; 1 పేతురు 1:18, 19).

యేసు రక్తం పాపాలను ఎప్పుడు కడిగివేస్తుంది? మనం ఆయనకు లోబడినప్పుడు – మనం విశ్వసించి, మారుమనస్సు పొంది, బాప్తిస్మం పొందినప్పుడు. మన పాప ఋణాన్ని ప్రభువు చెల్లించాడు, అయితే తన రక్తము ద్వారా ఏర్పాటు చేసిన రక్షణను పొందడానికిగాను ఆయనకు మనం లోబడాలి (హెబ్రీ. 5:9). అందువలన, రక్షణలో ''ఏమి?'' అనేది యేసు రక్తము; ''ఎప్పుడు?'' అనేది మనం ఆయనకు లోబడిన సమయం.

సరియైన అవలోకనములో, విశ్వాసము, మారుమనస్సు, ఒప్పుకోలు, బాప్తిస్మము అనే వన్నియు సువార్తకు మన ప్రత్యుత్తరంలోని భాగమైయున్నాయి. మన పాపములను ప్రభువు ఎలా తనమీద వేసికొని, పాప ఋణమును చెల్లించి, తన రక్తము ద్వారా మన పాపములనుండి మనలను క్షమించువాడైయుండి, విశ్వాసానికి ఏలికగా నియమింపబడి మన కొరకు విజ్ఞాపన చేయడానికి సజీవుడైయున్నాడనేది సువార్త సత్యం. మనం పాపం విషయమై చనిపోయి, ప్రభువుగాను ఏలికగాను ఆయనకు మన జీవితాలను సమర్పించుకొన్నట్టయితే, ఆయన మనకొరకు సంపాదించిన విజయం మనదైయుంటుంది.

---

సూచనలు

[1]రెండవ దానిపై వ్యక్తపరచినంత ప్రాముఖ్యత మొదటి దానిపై వ్యక్తపరచలేదనేది – భావం. ఈలాటి గ్రీకు పద అమరికలు యోహాను 6:27; 12:47; 1 తిమోతి 5:23; 1 పేతురు 3:3–4; మరియు యింకా అనేక స్థలాల్లో కన్పిస్తాయి.